ప్రజాశక్తి
శనివారం 17 ఫిబ్రవరి 2024 5 కర్నూలు





కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

కార్మిక, కర్షక కన్నెర్ర

- కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతం - కర్నూలులో భారీ ప్రదర్శన, జిల్లావ్యాప్తంగా నిరసనలు
- బిజెపిని, మద్దతిచ్చే పార్టీలను గద్దె దించడం కోసం పోరాడాలి - సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్/కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాల ఐక్య వేదిక, సంయుక్త కిసాన్ మోర్చా శుక్రవారం చేపట్టిన దేశ వ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ కర్నూలు జిల్లాలో విజయవంతమైంది. కర్నూలులో జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి రాజ్ విహార్, బుధవార పేట మీదుగా కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆదోని, దేవనకొండ, ఎమ్మిగనూరు, కౌతాళంలో ర్యాలీ, రాస్తారోకో, ఆస్పరిలో రాస్తారోకో, హోళగుంద, మంత్రాలయంలో ధర్నా నిర్వహించారు. ఆదోనిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, కర్నూలు మండలం ఉల్చాలలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి, కల్లూరు మండలం చిన్నటేకూరులో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, కర్నూలు కార్బైడ్ ఫ్యాక్టరీ దగ్గర హైవేపై చేపట్టిన రాస్తారోకోలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ పాల్గొని మాట్లాడారు. కలెక్టరేట్ వద్ద ఎఐటియుసి నగర అధ్యక్షులు వెంకటేశు, సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్, న్యూ సిటీ కార్యదర్శి సాయిబాబా అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ బిజెపిని, బిజెపికి మద్దతిచ్చే పార్టీలను గద్దె దించడం కోసం కార్మికులు, కర్షకులు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఢిల్లీకి రైతులను రానివ్వడం లేదని, కేంద్ర ప్రభుత్వం రైతులకు దాడి చేస్తోందని తెలిపారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చారని, కార్మికులను వెట్టి చాకిరీకి గురి చేసి కార్పొరేట్ల లాభాల కోసం కేంద్రం పని చేస్తోందని, అందుకే మోడీ దిగిపోవాలని కోరుతున్నామని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి మోడీ ప్రజా వ్యతిరేక విధానాల గురించి చెప్పాలన్నారు. ఎపిలో వైసిపి, టిడిపి బిజెపితో మైత్రి కోసం అరువులు చాస్తున్నాయని, మోడీకి భజన చేస్తున్నాయని తెలిపారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ ప్రజల కష్టార్జితాన్ని ప్రయివేటు కంపెనీలకు కట్టబెడుతున్నారని, అందుకే మోడీ పోవాలని చెబుతున్నామని తెలిపారు. మోడీ బ్రిటీషర్లు పాటించిన విభజించు పాలించు సూత్రాన్ని పాటిస్తున్నారన్నారు. బిజెపిని, బిజెపికి మద్దతిచ్చే పార్టీలను ఓడించకుండా దేశాన్ని కాపాడుకోలేమన్నారు. రాబోయే రోజుల్లో బిజెపికి నూకలు చెల్లాయని, ఆ విధంగా పోరాటాలు సాగించాలని తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు జగన్నాధం మాట్లాడుతూ మోడీ అదానీకి, అంబానికి లాభాలు చేకూర్చే చట్టాలు చేశారన్నారు. ప్రజల సొమ్మును కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఎవరు అధికారం ఇచ్చారని ప్రశ్నించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు మాట్లాడుతూ బిజెపిని తరిమికొట్టడమే ప్రధాన అజెండా అని తెలిపారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ బిజెపి పాలనలో కార్మికులకు కనీస భద్రత లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ, ఐఎఫ్‌టియు నాయకులు భాస్కర్, ఎస్‌యుసిఐ నాయకులు నాగన్న, అఖిల భారత రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహులు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు వై.నరసింహులు, బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామరాజు, రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ పోతుల శేఖర్, సిపిఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు అర్లప్ప, సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ కన్వీనర్ మహేష్ పాల్గొన్నారు.



కర్నూలు నగరంలో ప్రదర్శన చేపడుతున్న నాయకులు

కర్నూలు కార్పొరేషన్ : ఎఐఐఇఎ పిలుపుమేరకు ఎల్ఐసి కార్యాలయం ముందు కార్యదర్శి సునీయ కుమార్ ఆధ్వర్యంలోమ ఇన్సూరెన్స్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో నినాదాలు చేశారు. ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న బెంగళూరు, హైదరాబాదు రోడ్డుపై అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, సేఫ్టీ డ్రైవర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు యస్ అన్వర్ భాష, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు, మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నిస్సార్ అహ్మద్ మాట్లాడారు. లాంగ్ లారీ ఓనర్ అసోసియేషన్, మోటార్ వర్కర్స్ యూనియన్ కార్బైట్ ఫ్యాక్టరీ సమీపంలో హైవేపైన గంటన్నర పాటు రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, లాంగ్ లారీ ఓనర్ అసోసియేషన్ నాయకులు మీన్నల్ల, ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ మాట్లాడారు.

కర్నూలు క్రైమ్ : కర్నూలు మండలం ఉల్చాలలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షతన బంద్ నిర్వహించారు. రైతాంగ సమస్యలు పరిష్కారం చేయకుండా రైతులపై నిర్బంధం చేస్తూ రైతులను దగా చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.

కర్నూలు హాస్పిటల్ : కల్లూరు మండలం చిన్నటేకూరు దగ్గర 44వ నెంబరు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి కె.మధు మాట్లాడారు. ఓర్వకల్లులో ప్రజాసంఘాల కార్యాలయం నుండి ర్యాలీగా కార్యాలయాలను బంద్ చేసి జాతీయ రహదారిపై అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారు.

గూడూరులో సిఐటియు మండల ఉపాధ్యక్షులు రాజశేఖర్, పాముల రవి అధ్యక్షతన రాస్తారోకో నిర్వహించారు. **వెల్దుర్తి**లో పాత బస్టాండ్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు నగేష్, సిపిఐ మండల కార్యదర్శి కృష్ణ మాట్లాడారు. **తుగ్గలి**, జొన్నగిరిలో ఎపిజిబి మేనేజర్లకు వినతి పత్రాలు సమర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు, సిపిఐ మాజీ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడారు. **పత్తికొండ**లో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఎపి రైతు సంఘం గౌరవాధ్యక్షులు పి.రామచంద్రయ్య, సిపిఎం నాయకులు వెంకటేశ్వరరెడ్డి పాల్గొని మాట్లాడారు.



కర్నూలు నగరంలో మాట్లాడుతున్న ఎం.ఎ.గఫూర్



కర్నూలు నగరంలో మాట్లాడుతున్న ప్రభాకర్



భారత్ బందుకు ఎల్ఐసి ఉద్యోగుల సంఘీభావ నిరసన ప్రదర్శన

ఎన్నికల సామగ్రి కేంద్ర పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్పాచ్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన శుక్రవారం పరిశీలించారు. కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న కోడుమూరు, కర్నూలు ఔట్ డోర్ స్టేడియంలో ఏర్పాటు చేయనున్న కర్నూలు నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామాగ్రి డిస్పాచ్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన పరిశీలించారు. పోలింగ్ సామాగ్రిని త్వరితగతిన పంపిణీ చేసే దానికి ఎంత మంది మ్యాన్ పవర్ అవసరం ఉంటుందో చెక్ చేసుకోవాలని అదే విధంగా డిస్పాచ్ సెంటర్ల వద్ద టెంట్లు ఏర్పాటు చేయించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. వివిధ పోలింగ్ కేంద్రాలు వివిధ రూట్ మ్యాప్‌లలో ఉంటాయని, బస్సులకు రూట్ మ్యాప్ నెంబరింగ్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత రిటర్నింగ్ అధికారులకు తెలిపారు. ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకొని రావాలని కలెక్టర్ ఆర్ఓలకు సూచించారు. కలెక్టర్ వెంట పరిశీలన చేసిన వారిలో మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఇరిగేషన్ ఎస్ఇ రెడ్డి శేఖర్ రెడ్డి, టిడ్కో ఎస్ఇ రాజశేఖర్, ఆర్ అండ్ బి ఎస్ఇ నాగరాజు, డిఆర్ఓ మధుసూదనరావు, కర్నూలు ఆర్‌డిఓ శేషి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమం తీవ్రతరం చేస్తాం

- ఉద్యోగ జెఎసి సెక్రటరీ జనరల్ హృదయ రాజు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఎపి ఉద్యోగ జెఎసి రాష్ట్ర సెక్రటరీ జనరల్ జి.హృదయ రాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు మూడోరోజు జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయ ఐక్య కార్యచరణ సమితిలో భాగంగా ఉద్యోగులు ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో తమ నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఓ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్, నగర అధ్యక్షుడు కాశన్న, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి పాల్గొన్నారు. కర్నూలు నగరంలోని పాఠశాలలో ఉపాధ్యాయులతో మధ్యాహ్న భోజన విరామం సమయంలో జెఎసి సెక్రటరీ జనరల్ హృదయ రాజు పాల్గొని నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్ , మెడికల్ రీయంబర్స్‌మెంట్ , 11వ పిఆర్‌సి , డిఎ బకాయిలు పేరిట రూ.30వేల కోట్ల మేరకు పెండింగులో ఉన్నాయన్నారు. తక్షణమే వాటిని చెల్లించాలని , 12వ పిఆర్‌సి కమిషన్ వేసినప్పటికీ అమలు కానందున నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగిపోయిన కారణంగా వెంటనే 30శాతం మధ్యంతర భృతి (ఐ.ఆర్) ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ 70 ఏళ్ల వారికి 10శాతం, 75 పై బడ్డ వారికి 15 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు టివి రామకృష్ణ, జిల్లా కౌన్సిలర్ మాలిక్ బాషా, మహిళా సభ్యురాలు ఎన్. జ్ఞాన శిరోమణి, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న ఎపి ఉద్యోగ, ఉపాధ్యాయ జెఎసి సెక్రటరీ జనరల్ జి.హృదయ రాజు



బాలసుబ్బమ్మ భౌతిక కాయం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రసాద్‌శర్మకు మాతృవియోగం


కుటుంబసభ్యులను పరామర్శించిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా సివిల్‌పోరం జిల్లా కన్వీనర్ బి.ప్రసాద్ శర్మకు శుక్రవారం మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి బి.బాలసుబ్బమ్మ (78) గురువారం ప్రమాదవశాత్తు కష్టా నగర్లోని తన స్వగహంలో కాలుజారి కింద పడటంతో అనారోగ్యానికి గురయ్యారు. ఇంట్లోనే చికిత్స పొందుతూ శుక్రవారం కోలుకోలేక మృత్యువాత పడ్డారు. శోక సంద్రంలో ఉన్న ప్రసాద్‌శర్మ కుటుంబాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకష్ణ, కెవి.నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు నరసింహ, ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర నాయకులు వెంకట్ కోటేశ్వరరావు, శ్రీకాంత్, పలు ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి, గౌస్ దేశాయ్ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా వారి కుటుంబం సిపిఎం రాజకీయాలలో అంకితభావంతో కూడిన సాన్నిహిత్యం కలిగి ఉందన్నారు. సిపిఎం రాజకీయాలతో ప్రత్యక్షంగా ముడిపడి ఉన్న వారి కుటుంబానికి ఆమె సేవలు, సహకారం మరువలేనివని అన్నారు. ఆమె మరణం పార్టీకి కుటుంబానికి తీరని లోటని అన్నారు. పరామర్శించిన వారిలో సిపిఎం నాయకులు నగరనాయకులు సిహెచ్. సాయి బాబా తదిరులు పాల్గొన్నారు.

ఇవిఎంల పనితీరు పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



సాధారణ ఎన్నికల నేపథ్యంలో, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (137-కర్నూలు అసెంబ్లి నియోజక వర్గము) , కమిషనర్ భార్గవ్ తేజ, స్థానిక ఔట్ డోర్ స్టేడియంలో ఏర్పాటు చేయబోతున్న ఇవిఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పరిశీలనలో, డిస్ట్రిబ్యూషన్ ప్రణాళిక, ఇవిఎంల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. తరువాత డిస్ట్రిబ్యూషన్ సమర్థవంతంగా, సజావుగా నిర్వహించేందుకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో నగర పాలక అదనపు కమిషనర్ పివి. రామలింగేశ్వర్ , ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం : వైసిపి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మాటల ప్రభుత్వం కాదని వైసిపిది చేతల ప్రభుత్వమని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ. హఫీజ్ ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బివై.రామయ్య అన్నారు. శుక్రవారం కర్నూలు శ్రీ రాంబొట్ల దేవాలయంలో సిజిఎఫ్ నిధులు రూ. కోటి అంచనాలతో తలపెట్టిన ఐదంతస్తుల రాజగోపురం నిర్మాణం పనులకు సంబంధించి శిలాఫలకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం టిటిడి నిధులు రూ. 1.41 కోట్లతో నిర్మించిన మినీ కళ్యాణ మండప కార్యక్రమాన్ని ఆలయ చైర్ పర్సన్ నగరూరు దీప్తి శ్రీనివాసులుతో కలిసి ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ... రాంబొట్ల దేవాలయం పురాతన ఆలయంగా పేరుగాంచిందన్నారు. అలాంటి చారిత్రక సంపదను కాపాడుకోవాలన్నారు. గత ప్రభుత్వం ఆలయ అభివృద్ధిలో హామీలు తప్ప ఆచరణలు శూన్యమన్నారు. ఆలయ చైర్ పర్సన్ నగరూరు దీప్తి శ్రీనివాసులు నిధుల సమీకరణలో చేసిన కృషిని అభినందించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధిలో తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. బివై.రామయ్య మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే చేసిన కృషి, అందుకు తోడ్పాటు అందించిన దాతల సహకారం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో వాసవి విద్యా సంస్థల అధినేత సోమిశెట్టి వెంకటరామయ్య, మాజీ స్టాండింగ్ కమిటీ చైర్పర్సన్ జయంతి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు శేషు యాదవ్, సుజాత, యూనిస్, వైసిపి నాయకులు కృష్ణకాంత్ శర్మ పాల్గొన్నారు.



ఆలయ రాజగోపుర నిర్మాణ పనుల శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యేలకు, ఛైర్మన్‌కు సన్మానం

రాజధాని ఫైల్స్ సినిమాను అడ్డుకోవడం పిరికిపంద చర్య

టిడిపి అధ్యక్షులు బి టి నాయుడు ఆరోపణ



ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను అడ్డుకోవడం సిగ్గుచేటని, సినిమాను ప్రజలు చూస్తే జగన్‌ను ఛీకొడతారనే భయముందని, అందుకే అడ్డుకునే చర్యకు పూనుకున్నారని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు బిటి. నాయుడు ఆరోపించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పత్రికల వారితో బిటి.నాయుడు మాట్లాడుతూ 2014లో ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న సమయంలో సాక్షాత్తు శాసనసభలోనే అమరావతి రాజధాని ఏర్పాటును స్వాగతిస్తున్నామని, వీలైనంత ఎక్కువ భూమిని సేకరించి, అత్యున్నతంగా రాజధాని నిర్మాణం చేపట్టాలని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వానికి సూచన చేసిన ప్రస్తుతం ముఖ్యమంత్రి మూడు రాజధానుల డ్రామాకు తెరతీశారని అన్నారు. రాజధాని నిర్మాణం కోసం అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుపై నమ్మకంతో రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దాదాపు 35 వేల ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇచ్చారని తెలిపారు. జగన్ ఆడిన మూడు రాజధానుల డ్రామాతో రైతులు రోడ్డున పడ్డారనీ పేర్కొన్నారు. మళ్లి ఇప్పుడు హైదరాబాద్ ను ఉమ్మడి రాజధాని అంటూ మరో నాటకాన్ని తెరపైకి తెచ్చారని గుర్తుచేశారు. సామాజిక భాద్యతతో వాస్తవాలను సినిమా రూపంలో తీస్తే తప్పేమిటని ప్రశ్నించారు.

ప్రయాణికుల భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తులు, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మొదటి ప్రాధాన్యత నివ్వాలని కడప ఇడి గిడుగు .వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కర్నూలులో శిక్షణ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో గిడుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహా శివరత్రి సందర్భంగా వెంకటాపురం, శ్రీశైలం , మహానంది పుణ్యక్షేత్రాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మంచి కండిషన్ గల బస్సులు , ఘాట్ రూటు నందు అనుభవం గల డ్రైవర్లతో సర్వీసులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. డ్రైవర్లు స్టీరింగ్ మీద ఉన్న సమయంలో సెల్ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకొని వారి విధులను నిర్వర్తించేటట్లు చుసుకోవలన్నారు. అన్ని బస్టాండులలో తాగునీటి సదుపాయం మరుగుదొడ్లు , బస్టాండ్లు పరిశుభ్రముగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు.

ప్రయాణికుల భద్రతకు మొదటి ప్రాముఖ్యత ఇవ్వాలని తెలిపినారు. ఈ కార్యక్రమానికి కర్నూలు జిల్లా ప్రజా రవాణాధికారి టి.శ్రీనివాసులు , నంద్యాల జిల్లా ప్రజా రవాణాధికారి రజియా సుల్తానా , కర్నూలు, నంద్యాల జిల్లా డిపో మేనేజర్లు హాజరయ్యారు.



భారత్ బజాజ్‌లో కొత్త మోడల్ పల్సర్లు లాంచ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు బంగారు పేటలో గల భారత్ బజాజ్ షోరూం లో పల్సర్ కంపెనీ నుండి నూతనంగా లాంచ్ అయిన ఎన్ 150, ఎన్ 160 ను కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ పుష్ప కుమార్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా పుష్ప కుమార్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి నమ్మకంగా కస్టమర్లుకు మంచి సర్వీస్‌ను అందజేస్తున్న భారత్ బజాజ్ షోరూంలో తన చేతుల మీదుగా బైక్స్ లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. షోరూం మరింత వృద్ధిలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ ఫరూక్ , ఎన్ 150, ఎన్ 160 ప్రత్యేకతలను వివరించారు. మొబైల్ కనెక్షన్, బ్లూటూత్ కనెక్టివిటీ , కనెక్టెడ్ యాప్ ఆన్ ఫోన్ ఫీచర్స్ ఉన్నాయని తెలిపారు. వీటితోపాటు మొబైల్ ఛార్జింగ్ చార్జింగ్ సాకెట్ కూడా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత్ బజాజ్ ఎండి ఎస్ అక్తర్ హుస్సేన్ , సేల్స్ సిబ్బంది , సర్వీస్ సిబ్బంది వారు కూడా పాల్గొన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 81217 20443ను సంప్రదించాలన్నారు.

కర్నూలులో నేడు జెవివి సైన్స్ యాత్ర

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : విజ్ఞాన విశేషాలను విశదీకరిస్తూ కళారూపాల ద్వారా విద్యార్థులందు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి శనివారం జెవివి సైన్స్ యాత్ర కర్నూలులో పర్యటిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుధీర్ రాజు, ఖాజా హుస్సేన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలులోని స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో ఉదయం 9 గంటలకు సైన్స్ యాత్రలో భాగంగా పాటలు లఘునాటికలు ,నృత్య రూపకాలు ,మ్యాజిక్ వంటి కళారూపాల ద్వారా విద్యార్థుల్లో ఉన్న మూఢనమ్మకాలను నిర్మూలించడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సైన్స్ అభిమానులందరూ విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

18 నుంచి 2వ విడత ఇంటింటికీ బిఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : బహుజన్ సమాజ్ పార్టీ కర్నూలు నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ అంతర్గత సమావేశం ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికాంత్ అధ్యక్షతన నిర్వహించారు. రెండవ విడత ఇంటింటికీ బిఎస్‌పి కార్యక్రమం అసెంబ్లీ కమిటీ , నగర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి నిర్వహిస్తున్నామని నగర అధ్యక్షులు సాదిక్ , అసెంబ్లీ అధ్యక్షులు మధుకర్ తెలిపారు. కర్నూలు నగరంలోని 33వ వార్డులో కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి గాడి అరుణ్ కుమార్ హాజరవుతారని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు ఉంటుందన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరు

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు
- కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతం



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



ఎమ్మిగనూరులో నిరసన తెలియజేస్తున్న వామపక్ష ప్రజాసంఘాలు

ప్రజాశక్తి - ఆదోని

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ సందర్భంగా కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ గ్రౌండ్ నుంచి భీమాస్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, భీమాస్ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కె.అజయ్ బాబు, ఐఎఫ్‌టియు కార్యదర్శి వెంకప్ప, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, సిపిఐ, సిపిఎం పట్టణ కార్యదర్శులు సుదర్శన్, లక్ష్మన్న, సిఐటియు పట్టణ కార్యదర్శి పిఎస్.గోపాల్, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి బి.వెంకన్న మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మికులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర చట్టాన్ని తీసుకురావాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను ఎత్తేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. రోడ్డు రవాణా భద్రత బిల్లును ఉపసంహరించుకోవాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ ధరలు తగ్గించాలని, అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని కోరారు. విద్యుత్ సంస్కరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి విధానాలను రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి, జనసేనలు వ్యతిరేకించడం లేదని విమర్శించారు. రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు మల్లికార్జున, ప్రసాద్, సిఐటియు మండల కార్యదర్శి వీరారెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు తిప్పన్న, రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి కలభయ్ రాజు, ఎఐటియుసి నాయకులు ఒబి.నాగరాజు, విజయ్, షేక్షావలీ, కార్మికులు హనుమంతు, గోవిందు, వీరేష్, రాజు, పాల్, భీమా పాల్గొన్నారు. **దేవనకొండ** పట్టణంలోని అయ్యప్ప స్వామి గుడి దగ్గర నుంచి ర్యాలీగా వెళ్లి బస్టాండ్ దగ్గర రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి అశోక్ అధ్యక్షత వహించారు. వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెమద్దిలేటి శెట్టి, రైతు సంఘాల మండల కార్యదర్శులు సూరి, వెంకటేశ్వర్లు, సిఐటియు సీనియర్ నాయకులు నాగేష్, వ్యకాస నాయకులు బజారి, పరమేష్, యూసుఫ్ బాష, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు, రైతుసంఘం నాయకులు శ్రీరాములు, బడే సాబ్, రైతు, వ్యకాస, యువజన సంఘాల నాయకులు కెపి.రాముడు, లక్ష్మిరెడ్డి, బలరాముడు, నాగేంద్ర, వీరేంద్ర, రవీంద్రబాబు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, రైతుసంఘం, అంగన్వాడీ, ఆశా, వ్యకాస ఐక్యవేదిక, మాల మహానాడు, మైనార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్ చేపట్టారు. ముందుగా ఎల్ఐసి బ్రాంచి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నేషనల్ హైవే ఎంజి పెట్రోల్ బంక్ దగ్గర రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పెద్ద పార్కు, వీవర్స్ కాలనీ మీదుగా వైఎస్ఆర్ సర్కిల్, సోమప్ప సర్కిల్ వరకు ప్రదర్శన చేపట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఎఐటియుసి నాయకులు తిమ్మగురుడు, వీరేష్, రైతుసంఘం నాయకులు హనుమంతు, అబ్దుల్లా, లక్ష్మీనరసయ్య, పంపన్న గౌడ్, రంగన్న, జబ్బర్, ఐఎఫ్‌టియు నాయకులు రాజు, ప్రసాద్, కెవిపిఎస్ నాయకులు ఆంథోని, కలగొట్ల రాజు, మాల మహానాడు నాయకులు నరసన్న, అంగన్వాడీ యూనియన్ నాయకులు గోవర్ధనమ్మ, నాగలక్ష్మి, కృష్ణవేణి, శైలజా, నీరజ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి, ఎల్ఐసి యూనియన్ నాయకులు విజయ్ కుమార్, ధనుంజయ గౌడ్, వెల్ఫేర్ పార్టీ నాయకులు హకీం, డివైఎఫ్ఐ నాయకులు సురేష్ పాల్గొన్నారు. **ఆలూరులో** వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త గ్రామీణ బంద్ విజయవంతమైంది. పట్టణంలోని బళ్లారి రోడ్డు పెట్రోల్ బంకు నుంచి భారీ ర్యాలీతో అంబేద్కర్ సర్కిల్ చేరుకుని రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి, ఎపి రైతుసంఘం (సిపిఐ) జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు రామంజినేయులు, ఎఐకెఎస్ (సిపిఎం) మండల కార్యదర్శి ఈరన్న, సిఐటియు మండల కార్యదర్శి షాకీర్, వ్యకాస నాయకులు భూపేష్ మాట్లాడారు. గ్రామీణ బంద్‌లో పాల్గొని విజయవంతం చేసిన రైతులకు, వివిధ రంగాల కార్మికులకు అభినందనలు తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు హోతూరప్ప, వి.చంద్రకాంత్ రెడ్డి, గోపాల్, వి.రంగన్న, హమాలీ నాగరాజు, వీరేష్, డివైఎఫ్ఐ నాయకులు మైనా, గోవర్ధన్ పాల్గొన్నారు. **ఆలూరు** (ఆస్పరి)లో వామపక్ష ప్రజాసంఘాలు ర్యాలీగా వెళ్లి అన్ని ప్రభుత్వ కార్యాలయాలను, ప్రయివేట్ స్కూళ్లను బంద్‌కు సహకరించాలని కోరారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద గంటపాటు రాస్తారోకో చేపట్టారు. సిపిఐ నాయకులు కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బాలకృష్ణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి మాట్లాడారు. రైతు సంఘం, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శులు రంగస్వామి, రవి, నాయకులు మల్లికార్జున, నరేంద్ర, ఈరన్న, రామాంజనేయులు, పెద్ద రంగన్న, నరసింహులు, వీరభద్రి, శివ, రమేష్, రంగన్న, రాజశేఖర్, బ్రహ్మయ్య పాల్గొన్నారు. **హోళగుంద** తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్ఐ దినేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎఐటియుసి, సిఐటియు మండల కార్యదర్శులు రంగన్న, నాగరాజు అధ్యక్షత వహించారు. అనంతరం సిపిఎం, సిపిఐ మండల కార్యదర్శులు వెంకటేష్, మారెప్ప మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు మంగయ్య, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరంగ, సీనియర్ నాయకులు కట్టప్ప, రైతుసంఘం నాయకులు రవి, పంప, ఆటో యూనియన్ సాబీర్ మోద్దీన్ బాష, చాంద్ బాష, శివన్, అమీర్ పాల్గొన్నారు. **కౌతాళం** (మంత్రాలయం)లో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సిఐటియు, ఎఐటియుసి నాయకులు హెచ్.జయరాజు, భాస్కర్ యాదవ్, సిఐటియు నాయకులు టి.భీమేశ్వరి, విశాలాక్షి, ప్రమీల, కల్యాణి, శ్వేత, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు సుజాత, పద్మ, జయానంద కుమారి, సునీత, ఎఐటియుసి నాయకులు రాముడు, మస్తానీ, ప్రకాష్, కెవిపిఎస్ మండల నాయకులు అంజి, మారెప్ప, రైతుసంఘం నాయకులు జి.గాబ్రియేల్ పాల్గొన్నారు. **కౌతాళంలో** ర్యాలీ, నిర్వహించి అంబేద్కర్ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు జగదీష్ మాట్లాడారు. **ఆదోని (రూరల్)** మండలంలోని 5 ప్రాంతాల్లో రాస్తారోకోలు చేపట్టారు. సిరుగుప్ప క్రాస్ దగ్గర జరిగిన రాస్తారోకోలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, ఐఎఫ్‌టియు నాయకులు ఎంకప్ప, రైతుకూలీ సంఘం నాయకులు ప్రసాద్, పాండవగల్లు దగ్గర జరిగిన రాస్తారోకోలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు, కుప్పగల్లు దగ్గర జరిగిన రాస్తారోకోలో సిఐటియు మండల కార్యదర్శి బి.వీరారెడ్డి, సంతేకుడ్లూరు దగ్గర జరిగిన రాస్తారోకోలో కెవిపిఎస్ మండల కార్యదర్శి బి.తిక్కప్ప, విరుపాపురం దగ్గర జరిగిన రాస్తారోకోలో వ్యకాస (సిపిఐ) నాయకులు నరసప్ప, రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు మల్లికార్జున పాల్గొని మాట్లాడారు. **పెద్దకడబూరులో** రైతు సంఘం, వ్యకాస ఆధ్వర్యంలో ఉదయం నుంచే గ్రామంలోని పలు దుకాణాలకు వెళ్లి గ్రామీణ బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరడంతో స్వచ్ఛందంగా బంద్ చేశారు. వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలను బంద్ చేశారు. టిడిపి, జనసేన నాయకులు బంద్‌లో పాల్గొని మద్దతు తెలిపారు. పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. రైతుసంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేష్, సిఐటియు నాయకులు తిక్కన్న, వ్యకాస నాయకులు హనుమంతు, వెంకటేష్, టిడిపి నాయకులు మల్లికార్జున, నరసన్న పాల్గొన్నారు.



దేవనకొండలో రాస్తారోకో నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు



ఆలూరులో మాట్లాడుతున్న నారాయణస్వామి

ప్రెస్ స్టిక్కర్ వేసి అక్రమ మద్యం తరలింపు

- రూ.1.25 లక్షల విలువ గల మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - కౌతాళం

'ప్రెస్' స్టిక్కర్ వేసి వాహనం ద్వారా కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను తరలిస్తున్న నిందితులను పట్టుకున్నట్లు మంత్రాలయం సిఐ ఎరిషావలీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన అగ్రహారం చెన్నకేశవ టాటా బోల్ట్ ఎక్స్ ఇ ఎపి 21 బిఇ 1599 నెంబర్ గల వాహనంలో సుమారు రూ.1.25 లక్షల విలువ గల కర్ణాటక మద్యం 1,632 ఒరిజినల్ ఛాయిస్ టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా మంత్రాలయం సమీపంలో గోశాల సమీపంలో గుర్తించినట్లు చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎస్పీ కృష్ణ కాంత్, డీఎస్పీ సీతారామయ్య ఆదేశాల మేరకు ఎస్ఐ వేణుగోపాల్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టగా ఈ అక్రమ మద్యం రవాణా వెలుగు చూసిందని తెలిపారు. చెన్న కేశవకు కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను సరఫరా చేసే ఎ2 నిందితుడు పరారీలో ఉన్నాడని చెప్పారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసిన చెన్నకేశవను ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజులపాటు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

- తహశీల్దార్ పద్మజ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని 16 గ్రామాల్లో ఉన్న 29 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లు పూర్తి చేశామని తహశీల్దార్ పద్మజ తెలిపారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ఉన్న బూత్ లెవెల్ అధికారులందరూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల దగ్గర ఏ లోటు లేకుండా వసతులు చూసుకునే బాధ్యత బిఎల్ఒలు చూసుకుంటారని చెప్పారు. అధికారులందరూ సమన్వయంతో పార్టీలకతీతంగా విధులు నిర్వర్తించాలని కోరారు. రేషన్ సరుకుల పంపిణీలో ఏ సమస్యా రాకుండా చూసుకుంటున్నామని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ మధు స్వామి పాల్గొన్నారు.

నేడు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

- సిపిఎం తాలూకా నాయకులు నారాయణ స్వామి

ప్రజాశక్తి - హాలహర్వి



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న నాయకులు

రేషన్ పంపిణీలో నిర్లక్ష్యంపై శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం తాలూకా నాయకులు కెపి.నారాయణ స్వామి, మండల కార్యదర్శి కృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని బొలగోటి గ్రామంలో రేషన్ పంపిణీ సరిగా జరగడం లేదనే సమాచారంతో సిపిఎం నాయకులు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని బొలగోటి గ్రామంలో గత నాలుగు నెలల నుంచి రేషన్ పంపిణీ సరిగా జరగడం లేదని, రేషన్ పంపిణీ పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని విమర్శించారు. ఈ మారుమూల గ్రామంలో ఎక్కువగా పేదలు నివసిస్తున్నారని తెలిపారు. సరైన వర్షాల్లేక కరువు ఏర్పడి ఈ గ్రామంలో ప్రతి కుటుంబమూ రేషన్ బియ్యంపై ఆధారపడి బతుకుతున్నారని చెప్పారు. సిపిఎం నాయకులు రెవెన్యూ అధికారులను నిలదీయడంతో 25 క్వింటాళ్లు మాత్రమే పంపిణీ చేశారు. గ్రామంలో మొత్తం 53 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా కేవలం 25 క్వింటాళ్లు మాత్రమే తీసుకొచ్చారు. మిగిలిన 28 క్వింటాళ్లను కూడా పంపిణీ చేయాలని, లేకపోతే గ్రామస్తులతో కలిసి నేడు తహశీల్దార్ కార్యాలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు షాకీర్, ఈరన్న, గోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఓటింగ్'పై అవగాహన అవసరం : తహశీల్దార్

ప్రజాశక్తి - కౌతాళం

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటింగ్ విధానంపై బిఎల్‌ఒలు, సూపర్ వైజర్లు అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ శ్రీధర్ మూర్తి సూచించారు. శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు మంత్రాలయం తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ శశిశేఖర్‌తో కలిసి బిఎల్‌ఒలకు, సూపర్ వైజర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఓటింగ్ కోసం ఉపయోగించే కంట్రోల్ యూనిట్, వివి ప్యాడ్, ప్యారెట్ యూనిట్ మిషన్లను చూపిస్తూ అవగాహన కల్పించారు. ఓటరు ప్యారెట్ యూనిట్ మిషన్‌పై తమకు నచ్చిన పార్టీ గుర్తుపై ఓటు వేసి తాను అనుకున్న గుర్తుకే ఓటు పడిందా లేదా అనే విషయం తెలుసుకునేందుకు వివి ప్యాడ్‌లో కనిపిస్తుందని, ఆ తర్వాతే కంట్రోల్ యూనిట్ ద్వారా ఓటు 'కుయ్' అనే శబ్దం ద్వారా పూర్తవుతుందని తెలిపారు. మిషన్లలో పడిన బ్యాలెట్ పేపర్ల ద్వారా కంట్రోల్ యూనిట్ మిషన్ వల్ల ఎన్ని ఓట్లు ఏయే అభ్యర్థుల గుర్తుపై ఎన్ని ఓట్లు పడ్డాయనే విషయం లెక్కింపు వస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓటింగ్ యంత్రాల వినియోగం గురించి కూడా అవగాహన కల్పించారు.

నకిలీ విత్తనాలపై క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజాశక్తి - పెద్దకడబూరు

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతుల పొలాలను శుక్రవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పుచ్చకాయ నకిలీ విత్తనాలు సాగు చేసి నష్టపోయిన పెద్దకడబూరుకు చెందిన రైతు దాసరి శ్రీనివాసులు పొలాన్ని మహానంది ఉద్యానవన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఠాగూర్ నాయక్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి పి.రామాంజనేయులు, బి.బాలవర్ధి రాజు (ఆదోని సహాయ వ్యవసాయ సంచాలకులు), పెద్దకడబూరు ఎఒ వరప్రసాద్, ఉద్యానవన శాఖాధికారి హరీంద్ర పరిశీలించారు. రైతులు దగ్గర సాగు వివరాలు, యాజమాన్య పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ... విత్తన మొలక, పూత, కాయ సమస్యల గురించి అనుమానాలు తలెత్తితే పంట కాలం మధ్య దశలోపే తెలపాలని అన్నారు. అప్పుడు సమస్యకు గల పూర్తి కారణాలను అన్వేషించడం సులువవుతుందన్నారు. పంట నష్టం గురించి పూర్తి విశ్లేషణ, అనంతరం నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. వ్యవసాయ సహాయకులు ఇందు, శ్వేత, రైతులు శ్రీనివాసులు, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

'సిద్ధం'ను విజయవంతం చేయండి

- వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున

ప్రజాశక్తి - దేవనకొండ

ఈనెల 18న అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో జరిగే 'సిద్ధం' బహిరంగ సభను విజయవంతం చేయాలని వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున కోరారు. శుక్రవారం స్థానిక వైసిపి గెస్ట్ హౌస్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 18న జరిగే 'సిద్ధం'కు మండలం నుంచి అత్యధికంగా తరలిరావాలని కోరారు. ఎంపిటిసి సభ్యులు తపాల శ్రీనివాసులు నాయుడు, వైసిపి నాయకులు పాలకుర్తి ప్రతాప్, వెలమకూరు రామచంద్ర, పల్లెదొడ్డి చంద్ర, ఉరుకుందు, లింగన్న, వెంకటస్వామి, పొట్లపాడు ఆనంద్, సహదేవ్, కొత్తపేట సర్పంచి బాబు, వైసిపి కుంకునూరు గ్రామ నాయకులు రామప్ప, రంగన్న, పరమేష్, కిశోర్, వైసిపి యువ నాయకులు జనార్ధన్ నాయుడు, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

'ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలి'

ప్రజాశక్తి - నందవరం

ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ జెఎసి పిలుపు మేరకు శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన చేపట్టారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు జి.బసవరాజు (ఎస్‌టియు), జె.ఎల్లప్ప (యుటిఎఫ్), జి.ప్రసాద్ (ఎపిటిఎఫ్), బి.జయన్న (డిటిఎఫ్) పాల్గొన్నారు.



19 నుంచి ఎల్ఎల్‌సికి నీటి విడుదల

ప్రజాశక్తి - హోళగుంద

ఈనెల 19 నుంచి మార్చి 10 వరకు ఎల్ఎల్‌సికి తాగునీరు విడుదల చేస్తున్నట్లు మాజీ నీటి సంఘం అధ్యక్షులు తప్పెట రామారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. రైతుల విన్నపం మేరకు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి చొరవతో అధికారులతో చర్చించి పశుపక్షాదుల కోసం, తాగునీటి కోసం ఆంధ్ర సరిహద్దు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి తుంగభద్ర బోర్డు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈనెల మొదటి వారం నుంచి ఎండలు విపరీతంగా పెరగడం, ఈఏడాది వర్షాలు అతి తక్కువ స్థాయిలో కురిశాయని తెలిపారు. కుంటలు, బావులు, చెరువులు ఎండిపోవడంతో నీటిఎద్దడి ఏర్పడడంతో నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 10 టిఎంసిల లోపే నీటి నిల్వ ఉందని తెలిపారు.

ముమ్మరంగా తాగునీటి పైపులైన్ పనులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని నారాయణపురం గ్రామంలో తాగునీటి పైపులైన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డికి కాలనీవాసులు తాగునీటి సమస్యలు విన్నవించారు. కాలనీకి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు నారాయణపురం గ్రామంలో సర్పంచి అల్లమ్మగారి సరళమ్మ, వైసిపి నాయకులు పురుషోత్తం రెడ్డి దగ్గర ఉండి గ్రామంలోని నగరూరు గ్రామానికి వెళ్లే రస్తా ప్రాంతంలో గల కాలనీకి కొత్త పైపు లైన్ పనులు ప్రారంభించారు. త్వరలోనే ప్రతి ఇంటికీ కుళాయి వేసి తాగునీరు సక్రమంగా అందించే విధంగా కృషి చేస్తామని పురుషోత్తం రెడ్డి శుక్రవారం తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కౌతాళం

ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి బాధితులకు అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో ఇద్దరు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన గంజి మహదేవి, రచ్చుమర్రి గ్రామానికి చెందిన రఘునాథ్ రెడ్డిలు ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సిఫారసు లేఖతో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. అందులో భాగంగానే బాధితులకు రూ.లక్ష చొప్పున చెక్కులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, నాయకులు రోగప్ప, రవిరెడ్డి ఉన్నారు.

శాంతిభద్రతలపై దృష్టి సారించండి

గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి శాంతిభద్రతలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సిఐ ఎరిషావలీ, ఎస్ఐలు వేణుగోపాల్ రాజు, కృష్ణమూర్తిని కోరారు. మండలంలోని మాధవరం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణమూర్తి సిఐ, మంత్రాలయం ఎస్ఐతో కలిసి ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

టిడిపి అధికారంలోకి రావడం తథ్యం

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని కౌడల్‌పేటలో వెలసిన హెబ్బుట లక్ష్మమ్మవ్వ దేవర శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయం చేరుకున్న గుడిసె ఆది కృష్ణమ్మకు ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమె శ్రీలక్ష్మమ్మవ్వను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపిపి మురళీ, పట్టణ ముస్లిం, మైనార్టీ నాయకులు సాధిక్ వలీ, వైపి.భరత్ కుమార్, రాఘవేంద్ర రెడ్డి, వైబి.రవి, పెద్ద లక్ష్మన్న, బిజెపి నాగరాజ్, ఆంజనేయులు, తలారి మౌనప్ప పాల్గొన్నారు.



ఉత్సవంలో పాల్గొన్న గుడిసె ఆది కృష్ణమ్మ



వెళ్తున్న జై భీమ్ మాల మహానాడు నాయకులు

కేంద్రమంత్రి నుంచి రంగయ్యకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో వివిధ పార్టీల బలోపేతానికి వివిధ సర్వే రిపోర్టుల ఆధారంగా దళిత నాయకులకు ప్రాధాన్యత కలిపించడానికి నడుం బిగించాయి. అత్యవసర సమావేశానికి హాజరు కావాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కేంద్ర ఎంపవర్‌మెంట్ అండ్ సోషల్ జస్టిస్ మంత్రి కార్యవర్గం నుంచి జై భీమ్ మాల మహానాడు రాష్ట్ర నాయకులు సి.రంగయ్యకు పిలుపు వచ్చినట్లు నాయకులు తెలిపారు. జైభీమ్ మాలమహానాడు యువదళం జిల్లా నాయకులు మాట్లాడుతూ... దళిత జాతికోసం నిరంతరం కృషి చేస్తూ, సామాన్యులకు అండగా ఉంటూ పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. శుక్రవారం జిల్లా కార్యవర్గం బెంగళూరుకు వెళ్లారని చెప్పారు. మల్లేష్, పరమేష్, బలరాం, రాముడు, నరసింహా, నరసప్ప, సీనియర్ నాయకులు చిన్న రంగన్న, రాజోలప్ప, గుడికల్ రంగన్న పాల్గొన్నారు.

'ఎమ్మిగనూరు బరిలో బీవీనే'

ప్రజాశక్తి - నందవరం

టిడిపి తరపున ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచేది డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డినే అని ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు హాలహర్వి దావీదు, నందవరం ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముగతి, మాజీ సర్పంచి బాలరాజు తెలిపారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మిగనూరు నుంచి పోటీ చేసే అభ్యర్థుల విషయంలో కొంతకాలంగా వస్తున్న వార్తలు అవాస్తవాలని, రానున్న ఎన్నికల్లో అధిష్టానం బీవీకే కేటాయిస్తుందని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పట్టణ, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేసే బీవీ కుటుంబాన్ని నియోజకవర్గ ప్రజలు ఆదరించి గెలిపిస్తారని చెప్పారు. బీవీని కాదని వేరే వ్యక్తులకు సీటు కేటాయిస్తే పార్టీ ఇబ్బందుల పాలవుతుందని తెలిపారు. సోమల గూడూరు ఆనంద్ రాజ్, మాజీ సర్పంచి దాస్, జనరల్ సెక్రటరీ పూలచింత బంగారి, కనకవీడు రాజు, సోషల్ మీడియా మణికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు దావీదు, బాలరాజు

ఆరోగ్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి : జెఎసి

దేవనకొండ : ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాల్లో పని చేస్తున్న ఉద్యోగుల పెండింగ్ పిఆర్‌సి, డిఎ, అరియర్స్, జిపిఎఫ్, సరెండర్ లీవులు తదితర సమస్యల పరిష్కరించాలని నాయకులు కోరారు. రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది నిరసన చేపట్టారు. జెఎసి ఛైర్మన్ సాయి బాబా, నాయకులు రంగస్వామి మాట్లాడారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కొత్త ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జెఎసి నాయ కులు సుంకన్న, భాస్కరరావు, భాగ్యలక్ష్మి, జయ లక్ష్మి, వెంకటమ్మ, మాదమ్మ, సునీత పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయంతో సహనం కోల్పోతున్న కార్యకర్తలు

- టిడిపి మండల కన్వీనర్ అశోక్ యాదవ్

ప్రజాశక్తి-ఆలూరు

25 ఏళ్లుగా టిడిపి అధిష్టానం నిర్ణయంతో సహనం కోల్పోతున్నామని టిడిపి మండల కన్వీనర్ అశోక్ యాదవ్, భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆలూరు టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో టిడిపికి నాయకులు, కార్యకర్తలు బలంగా ఉన్నా అసెంబ్లీ సీటు కేటాయించడంలో అధిష్టానం నిర్ణయంతో ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపునకు దూరమవుతున్నారని తెలిపారు. ఇన్‌ఛార్జీగా నాలుగేళ్లకు పైగా అందరినీ సమన్వయం చేసుకొని కోట్ల సుజాతమ్మకు నాయకులు, కార్యకర్తలకు అండగా ఉన్నారని చెప్పారు. ఆమెకు సీటు కేటాయించడంలో ఆలస్యం కావడం, పార్టీలో, ప్రతిపక్ష పార్టీ నుంచి వచ్చిన వారు ఆలూరు టిడిపి టికెట్ 'మాకే' అంటూ ప్రచారాలు చేయడంతో కార్యకర్తలు ఆయోమయంలో ఉన్నారని తెలిపారు. పార్టీకి నష్టం వాటిల్లకుండా అధిష్టానం త్వరగా నిర్ణయం తీసుకొని కోట్ల సుజాతమ్మకే సీటు కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని చంద్రబాబుకు బహుమతిగా ఇస్తామని చెప్పారు. నర్సప్ప, చంద్రశేఖర్, మరకట్టు ఎల్లప్ప, మోహన్ రాజు, ఈరన్న, రాజశేఖర్, నాగరాజు, రాముడు, ఐకాంత్, జలందర్, లక్ష్మీపతి, మహేష్, మంగలి రామాంజి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ యాదవ్

భ్రూణ హత్యల నివారణకు చర్యలు

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

సమాజంలో లింగ అసమానతలకు కారణమవుతున్న భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారించేందుకు కృషి చేయాలని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సూచించారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో భ్రూణ హత్యలు నివారించడం, పిసి పిఎన్‌డిటి చట్టంపై డివిజన్‌లోని స్కానింగ్ సెంటర్ల యాజమాన్యం, గైనకాలజిస్టులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల ఆలోచన విధానంలో మార్పులు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించగలమని తెలిపారు. రానున్న రోజుల్లో గర్భస్త శిశువులపై లింగ వివక్షకు వ్యతిరేకంగా, పిసి పిఎన్‌డిటి చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంగించిన వారిపై రూ.50 వేల జరిమాన నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని తెలిపారు. పిసి పిఎన్‌డిటి చట్టం ప్రకారం స్కానింగ్ కేంద్రాలపై కచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకూ బహుమతి అందించే అవకాశం ఉందన్నారు. ఆదోని డివిజన్ పరిధిలో ఉన్న 48 స్కానింగ్ కేంద్రాలను నెలకోసారి తనిఖీ చేసి నూతన రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్, సిబ్బంది, చిరునామా, పరికరాల్లో మార్పులు వంటి అంశాలపై తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కానింగ్ కేంద్రాల అనుమతులు రద్దు చేస్తామన్నారు. ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, డాక్టర్ మాధవి లత, మెడికల్ సూపరింటెండెంట్ ప్రమీల, డిస్ట్రిక్ట్ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

పారదర్శకంగా ఓటర్ల జాబితా

ఓటర్ల జాబితాను ఎలాంటి లోపాలూ లేకుండా పారదర్శకంగా రూపొందించామని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ శివ నారాయణ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులు, రాజకీయ పార్టీలు సూచించిన ఫిర్యాదులు, పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలను పరిగణనలోకి తీసుకొని ఓటర్ల తుది జాబితాను రూపొందించామని వివరించారు. ఓటర్ జాబితాపై ఏదైనా సందేహాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. నియోజకవర్గంలోని 256 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఉండాల్సిన సదుపాయాలు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్, ర్యాంపు తదితర సదుపాయాలు పక్కాగా ఉండేటట్లు చూసుకోవాలని తహశీల్దార్ హసీనా సుల్తానా ఆదేశించారు. డిప్యూటీ తహశీల్దార్ రజినీకాంత్ రెడ్డి, ఎన్నికల సీనియర్ సహాయకులు ఖాసీం, రాజకీయ పార్టీ ప్రతినిధులు నాగరాజ్ గౌడ్, ప్రసాద్ రావు, బుద్ధారెడ్డి, శాంత కుమార్, దీలవర్ పాల్గొన్నారు.

ఆదోనిరూరల్ : తాత్కాలికమైన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు వసతుల పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదేశించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణలో సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ నిమిత్తం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన తాత్కాలికమైన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పార్కింగ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఏ సెక్టార్ పోలింగ్ కేంద్రం దూరంగా ఉంటుందో.. అలాంటి కేంద్రాలకు ప్రాధాన్యత క్రమంలో పోలింగ్ సామగ్రి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఎన్నికల సామగ్రి స్ట్రాంగ్ రూమ్‌లో పెట్టిన తర్వాత ఎవరూ ప్రవేశించకుండా సీలింగ్ చేయాలన్నారు. ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసే సమయంలో ఇతరులు లోపలికి రాకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేసి కేవలం పోలింగ్ సామగ్రితో సిబ్బంది వెళ్లే బస్సులు మాత్రమే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహశీల్దార్ హసీనా సుల్తానా, మండల సర్వేయర్ రమణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేతన ప్రియ పాల్గొన్నారు.





సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కార్మిక, కర్షక ఆగ్రహం

- కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతం
- జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు
- నంద్యాలలో ర్యాలీ
- ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోకపోతే బిజెపికి పుట్టగతులుండవు
- కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి. రమేష్ కుమార్

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా శుక్రవారం చేపట్టిన బంద్ నంద్యాల జిల్లాలో విజయ వంతమైంది. జిల్లా వ్యాప్తంగా ర్యాలీ, రాస్తారోకో, ధర్నా వంటి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోకపోతే బిజెపికి పుట్టగతులుండవని కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు హెచ్చరించారు..

ప్రజాశక్తి-విలేకరులు

నంద్యాల టెక్కె మార్కెట్ యార్డ్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు కార్మికుల ప్రదర్శన, బైక్ ర్యాలీ, ఆటోలతో ర్యాలీ వందలాది మందితో భారీగా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.రమేష్ కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోటమద్దులు, పట్టణ కార్యదర్శి కె మహమ్మద్ గౌస్, సిఐటియు నాయకులు పుల్లా నరసింహ, పట్టణ కోశాధికారి వెంకట లింగం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడుదారులకు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ రైతులను, కార్మికులను నయా బానిసలుగా చేసే చట్టాలను రూపొందించారని,వాటిపైన పెద్ద ఎత్తున ఢిల్లీలో ఉద్యమాలు జరుగుతుంటే వారిపైన నీటి ఫిరంగులతో లాటీఛార్జ్‌లతో రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పోరాడితే ఇలాంటి చర్యలకు పాల్పడడం దుర్మార్గమని, అదే విధంగా బ్రిటిష్ కాలం నాటి నుండి ఉన్న 44 కార్మిక చట్టాలను సవరణల పేరుతో నాలుగు సివిల్ కోడులుగా మార్పు చేసి కార్మికులను పరిశ్రమల యాజమాన్లకు నయా బానిసలుగా చేయడం దుర్మార్గమని తెలిపారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పని 200 రోజులు కల్పించాలని, 600 రూపాయలు రోజువారి కూలీ ఇవ్వాలని అన్నారు. డ్రైవర్ల పాలిట శాపంగా మారి, డ్రైవర్ల జీవితాలను నాశనం చేసేలా జైలుకు పంపించి కుటుంబాలను రోడ్డున పడేలా చేస్తున్న హిట్ అండ్ రన్ చట్టాన్ని భారత న్యాయ సంహిత సెక్షన్ 106(1)(2) లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి విధానాలను వ్యతిరేకించకుండా బలపరుస్తూ రాష్ట్రాన్ని నాశనం చేయాలని చూస్తున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను ప్రజలు నమ్మవద్దని, రాబోయే ఎన్నికల్లో అన్ని పార్టీలకు బుద్ధి చెప్పాలని అన్నారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మలమ్మ, నాయకురాలు సునీత, నాగరాణి, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏ రమేష్ బాబు, ఆర్ఎఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు పుల్లయ్య పాల్గొన్నారు. **ఆత్మకూరు**లో సుదర్శన వర్మ భవనం నుంచి గౌడ్ సెంటర్, బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో చేపట్టారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, అధ్యక్షులు రజాక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం మండల అధ్యక్షులు మాభాష, కార్యదర్శి వీరన్న అన్నారు. **నందికొట్కూరు టౌన్**లో భరత్ కాంప్లెక్స్ నుండి ర్యాలీగా పొట్టి శ్రీరాములు విగ్రహం మీదుగా పటేల్ సెంటర్ చేరుకొని రాస్తారోకో చేపట్టారు. గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతం అయిందని వ్యాకాస జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు బెస్తరాజు తెలిపారు. జూపాడుబంగ్లాలో సిఐటియు నాయకులు నరసింహ అధ్యక్షతన రాస్తారోకో నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం కర్ణ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఎక్కిన నాటి నుంచి నేటి వరకు రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని తెలిపారు. **బేతంచెర్ల** కర్నూలు, నంద్యాల సర్కిల్ గురువయ్య పెట్రోల్ బంకు దగ్గర తెల్లవారుజామున 5 గంటల నుండి వాహన డ్రైవర్లు సమ్మె చేపట్టారు. డ్రైవర్లను జైలు పాలు చేసే హిట్ అండ్ రన్ చట్టాల రద్దు చేయాలని ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు వైబి వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వై ఎల్లయ్య, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి శేభా రాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగాపురంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

తరువాయి 6లో..





ఆత్మకూరు పట్టణంలో ర్యాలీ, రాస్తారోకో ప్రజా సంఘాలు కార్యకర్తలు నాయకులు

రూ.9.68 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

- పైలాన్‌లను ఆవిష్కరించిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి -ప్యాపిలి

ప్యాపిలి మండలంలో రూ.9.68 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. ముందుగా ప్యాపిలిలోని పీఆర్ పల్లిలో రూ.83.14 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను మంత్రి ప్రారంభించారు. రూ.38.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.23.84 లక్షలతో తీర్చిదిద్దిన డాక్టర్ వైఎస్ఆర్ రైతుభరోసా కేంద్రం, రూ.20. 80 లక్షలతో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ లకు సంబంధించిన పైలాన్ లను ఆయన ఆవిష్కరించారు. పీఆర్ పల్లి గ్రామంలో గుడిపాడు నుంచి పీఆర్ పల్లి వరకూ నిర్మించిన రూ.3.4 కోట్లతో రహదారిని గ్రామస్థులతో కలిసి అట్టహాసంగా మంత్రి ప్రారంభించారు. అనంతరం కోటి రూపాయలతో కోన ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి గుట్టలపల్లి వరకూ వేసిన రోడ్డును ప్రారంభించారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శ్రీ కంబగిరి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో పునరుద్ధరణ పనులను ప్రారంభించి, రూ.కోటితో ఆలయ ప్రాంగణంలో తీర్చిదిద్దిన అంతర్గత సీసీ రోడ్లకు సంబంధించిన పైలాన్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆలయానికి వచ్చిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌కు వేదపండితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కంబగిరి స్వామిని మంత్రి బుగ్గన దర్శించుకున్నారు. కొత్తగా కడుతున్న మండపంలో నిర్మాణ పనులను పరిశీలించారు. ఏ ప్రమాదానికి అవకాశం ఇవ్వకుండా ఆలయ ప్రహరీ గోడను కట్టుదిట్టంగా నిర్మించాలని మంత్రి ఆదేశించారు. అనంతరం సీతమ్మతాండ గ్రామంలో రూ.18 లక్షలతో చేపట్టిన అంతర్గత సీసీ రహదారుల పనులకు సంబంధించిన పైలాన్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆ తర్వాత బూరుగల గ్రామంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పర్యటించారు. మొత్తం రూ.1.27 కోట్లకు సంబంధించిన పనులను ఆయన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. బూరుగల గ్రామంలో రూ.23.94 లక్షలతో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ఆర్ రైతుభరోసా కేంద్రం, రూ.38.4 లక్షలతో తీర్చిదిద్దిన సచివాలయ భవనం, రూ.77 లక్షలతో గ్రామంలోని అంతర్గత సీసీ రహదారులు, రూ.8 లక్షలతో అభివృద్ధి చేసిన బూరుగల ఊరు వాకిలి పనులను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ గ్రామ ప్రజలతో కలిసి ప్రారంభించారు.

15 కుటుంబాలు వైసిపిలోకి చేరిక

అనంతరం ప్యాపిలిలోని గుట్టలపల్లి గ్రామానికి చెందిన 15 కుటుంబాలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఎప్పుడు ఏ సాయం, అభివృద్ధి కావాలన్నా తాను అండగా ఉన్నానంటూ ఆర్థిక శాఖ మంత్రి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. మీ అందరి భాగస్వామ్యతో మరింత అభివృద్ధి చేసి చూపుతానంటూ వారికి మంత్రి బుగ్గన హామీ ఇచ్చారు. జల్దుర్గం గ్రామంలో 25 లక్షలతో గ్రంథాలయం, కోటి రూపాయలతో షాదీ ఖానా, రైతుల కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ ఛైర్మన్, శ్రీరాములు, పుల్లారెడ్డి, మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, పోదొడ్డి కష్ణమూర్తి, దిలీప్ చక్రవర్తి, బోరా మల్లికార్జునరెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, ప్రేమ్ సాగర్, మల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,మహేశ్వరమ్మ, శ్యామ్ రెడ్డి, తులసి రెడ్డి, జలదుర్గం రసూల్, కొండారెడ్డి, శ్రీనివాసులు, దస్తగిరి, జమాల్ బాషా, మండల వైసీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



లింకు క్రెడిట్ ప్లాన్ పోస్టర్ను ఆవిష్కరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్, ఎమ్మెల్యే తదితరులు

జెఎసి ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు తాలూకా తహసిల్దార్ కార్యాలయము వద్ద ఏపీ జెఎసి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు ఆత్మకూరు తాలూకా చైర్మన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. మధ్యంతర భృతి సాధించేవరకు ఈ పోరాటం ఆగదని హెచ్చరిం చారు. రేపు జరగబోయే ర్యాలీలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎన్జీవోతాలూకా కార్యదర్శి సాజిద్ బాష, విశ్రాం త ఉద్యోగుల అధ్యక్షులు అచ్చయ్య ఆర్టీసీ ఉద్యోగ నాయకులు కలీముల్లా,షఫీ ఉల్లా,ఎం ఎం బాష, ఎన్జీవోసంఘకార్యవర్గ సభ్యులురాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

గొర్రెల మందపై కుక్కల దాడి

- 60 గొర్రె పిల్లలు మృతి
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని వేములపాడు గ్రామంలో గొర్రె పిల్లల మందపై కుక్కలు దాడి చేయడంతో 60 గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి చౌడం కృష్ణుడు చెందిన గొర్రె పిల్లలను ఊరు బయట ఉన్న పశువుల పాకలో ఉంచి యధావిధిగా గొర్రెలు మేపటానికి వెళ్లడం జరిగిందని తెలిపారు. గొర్రెల కాపరి చౌడం కృష్ణుడు తన పనులు ముగించుకుని పశువులపాకకు చేరుకోగా అక్కడ 60 గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన చూసి విలవిలలాడాడు. తన గొర్రె పిల్లలను కుక్కలు దాడి చేసి చంపి వేయడం జరిగిందని బోరున విలపించాడు సుమారు మూడు లక్షల మేర నష్టం వాటిల్లిందని వాపోయాడు. ఈ విషయంపై ప్రభుత్వము తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.



మృతి చెందిన గొర్రె పిల్లలు

సమ్మె హామీలు అమలు చేయాలి

- వినతి పత్రం ఇచ్చిన మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, అధ్యక్షులు రజాక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్నలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రషీద్, మున్సిపల్ మేనేజర్‌లకు సమ్మె కాలపు హామీలు అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ కానుక, సమ్మె కాలపు వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారని వాటిని అమలు చేయాలన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ కార్మికుల అకౌంట్లో జమ చేయాలన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. కొత్తగా తీసుకున్న కార్మికులకు, అప్కాస్ జీతాలు హెల్త్ అలవెన్స్ అమలు చేయాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు సిఐటియు నాయకులు ఇస్మాయిల్, సురేంద్ర, రమేష్, జయన్న, సురేష్, రవి, జాన్సన్, నాగన్న, జీవరత్నమ్మ, సువర్ణమ్మ, సుశీలమ్మ, సామక్క, నాగక్క, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సిఐటియు జిల్లా నాయకులు యేసు రత్నం తదితరులు

మద్దతు ధరతో జొన్న పంట కొనుగోలు

- వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ పి.పి.నాగి రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు రాజమోహన్ రెడ్డి, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మిడుతూరు, పాములపాడు, నందికొట్కూరు మండలాల్లో జొన్న కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్వాలిటీ చెక్ అప్ కోసం తగినంత సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సివిల్ సప్లై డియంను ఆదేశించారు. సూక్ష్మ సేద్యం కింద డ్రిప్పు పైపులను త్వరితగతిన రైతులకు అందజేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎంఐపి పిఓను జెసి ఆదేశించారు. మార్క్ఫెడ్ చైర్మన్ పి పి నాగిరెడ్డి మాట్లాడుతూ జొన్న కొనుగోలు కేంద్రాలకు కావలసిన రవాణా సౌకర్యం, గన్నీ సంచులను రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాం భూపాల్ రెడ్డి మాట్లాడుతూ గడివేముల మండలంలో జిందాల్ ఫ్యాక్టరీ సమీపంలో రైతులు వేసిన జొన్న పంట ఫ్యాక్టరీ నుండి వచ్చే కాలుష్యం వలన నాణ్యత తగ్గి కొనుగోలుకు అవకాశం లేకుండా పోతుందని పశుదాణా కింద పనుకోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారులను సూచించారు. మిగిలిన మొత్తాన్ని సంబంధిత ఫ్యాక్టరీ నుండి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. అనంతరం నాబార్డ్ వారి 2024-25 పొటెన్షియల్ లింక్ క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, నాబార్డ్ డిఎం సుబ్బారెడ్డి, మార్కెటింగ్, మార్క్ఫెడ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



గంగుల ప్రభాకర్ రెడ్డికి పూలమాలవేసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న సుద్దుల కృష్ణుడు కుటుంబ సభ్యులు

వైసిపి సేవాదళ్ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా సుద్దుల కృష్ణుడు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు సుద్దుల కృష్ణుడు వైసిపి రాష్ట్ర సేవాదళ్ సెల్ జాయింట్ సెక్రటరీగా ఎంపికయ్యారు. శుక్రవారం ఎంపికైన ఆయనను పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్నేహితులు, అభిమానులు, గ్రామస్తులు అభినందించారు. తనను వైసిపి రాష్ట్ర సేవాదళ్ సెల్ జాయింట్ సెక్రటరీగా ఎంపిక చేసినందుకు రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డినీ వారి స్వగృహంలో కుటుంబ సభ్యులు అభిమానులతో స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత : ఎస్పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవియన్స్ డే నిర్వహి స్తున్నట్లు జిల్లా ఎస్పీ కే. రఘువీర్ రెడ్డి తెలిపారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం జిల్లా ఎస్పీ కే .రఘువీర్ రెడ్డి జిల్లా పోలీసు కార్యాల యంలో పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ గారు సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తూ సిబ్బంది సమస్యల పరిష్కరానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది వారి సమస్యలను నిర్భయంగా తెలియజేసుకోవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. విధినిర్వహణలో సిబ్బంది సతమత పడకుండా వారి సమస్యల తొలగించి రాబోయే ఎన్నికలలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలిపారు. సిబ్బంది యొక్క ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని సంబ ంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీస్పీ సంతోష్ ఆర్ ఎస్ ఐ వీరన్న పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ కె . రఘువీర్ రెడ్డి

ఓట్ల లెక్కింపు కేంద్రాలపై ప్రతిపాదనలు

- జిల్లా కలెక్టర్ కె. శ్రీనివాసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రానున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలపై జిల్లాలోని ఎస్వీఆర్ కాలేజీ, శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజ్ ఆర్జీఎం ఇంజనీరింగ్ కాలేజ్, గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, పాలిటెక్నిక్ కళాశాల, నెరవాడ గురుకుల పాఠశాల తదితర కళాశాలల జాబితా ప్రతిపాదనలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించి నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ సెంటర్ల నిర్వహణ తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తరపున సయ్యద్ రియాజ్ బాష, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి శివరామిరెడ్డి, బిజెపి తరపున చంద్రశేఖర్, వైయస్సార్సీపి తరపున సూర్యనారాయణ రెడ్డి సిపిఐ(ఎం) పార్టీ తరపున రమేష్ కుమార్ బీఎస్పీ పార్టీ తరపున వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, శాంతిరాం, ఆర్జీఎం ఇంజనీరింగ్ కాలేజీలు ఓట్ల లెక్కింపు అనుకూలంగా ఉన్నాయన్నారు. జిల్లాలోని గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, పాలిటెక్నిక్ కళాశాల, నెరవాడ గురుకుల పాఠశాల తదితర కళాశాలలు అనుకూలంగా లేవని రాజకీయ పార్టీలు... ఆక్షేపిస్తే గతంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాలోని రాయలసీమ యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు నిర్వహిస్తామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్నీ ఆర్జిఎం ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించాలని అంగీకరించడంతో జిల్లాలో గుర్తించిన సంబంధిత కళాశాలల జాబితాను ఎన్నికల కమిషన్ కు ప్రతిపాదనలు సమర్పించి తదుపరి చర్యలు గైకొంటామని కలెక్టర్ వివరించారు.

రైతుల జీవితాలతో సిఎం చెలగాటం : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని నందవరం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డికి టిడిపి మండల అధ్యక్షులు పివి కుమార్ రెడ్డి టిడిపి నాయకులు సూర్యనారాయణ రెడ్డి వెంగన్నల ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్ రెడ్డి ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ, వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించారు. బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 16న రాజధాని ఫైల్స్ సినిమా విడుదలకు హై కోర్ట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, ఇది ప్రజా వ్యతిరేక జగన్ రెడ్డి కుట్రలకు చెంపపెట్టు లాంటిదని అన్నారు. 2024లో టీడీపీ, జనసేన పార్టీలు కలిసి సైకో పాలనకు అంతం పలికి, ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి రెడ్డి, రమణ రెడ్డి, చింతామను వలి, నడిపన్న గారి రామ్మోహన్, బాల వెంకటేశ్వర్లు, నడిపి జంబూలయ్య , టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు



భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సమస్యలను పరిష్కరించకుంటే 20 నుంచి సమ్మె

- వీఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు నాగేష్

ప్రజాశక్తి - బేతంచర్ల

రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్ఏలు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో ఈనెల 20వ తేదీ నుండి సిఐటియు ఆధ్వర్యంలో వీఆర్ఏలు సమ్మెలోకి వెళ్ళవలసి ఉంటుందని వీఆర్ఏల జిల్లా అధ్యక్షుడు ఎం నాగేష్ అన్నారు. శుక్రవారం నాడు స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు నాయకులు ఎస్ కే బాష ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, అనంతరం తాసిల్దార్ జీవన్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 18, 19, 20వ తేదీలలో సిఐటియు ఆధ్వర్యంలో విజయవాడ అలంకార్ సెంటర్ నందు వీఆర్ఏలు వీఆర్ఏలకు కలిసే వేతనం అమలు చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో పాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని దీక్షలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ నాగలక్ష్మి, రాముడు బాష తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి చేరిక


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గౌరు వెంకటరెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణానికి చెందిన కొంతమంది యువకులు శుక్రవారం అల్లూరు గ్రామంలో పట్టణ తెలుగుదేశం నాయకులు షకీల్ అహ్మద్ ఆధ్వర్యంలో నందికొట్కూరు నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ బాధ్యుడు గౌరు వెంకటరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. సందర్భంగా గౌరవ వెంకట్ రెడ్డి వారికి తెలుగుదేశం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రహంతుల్ల, మహమ్మద్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.


కొట్టుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొంగర వెంకటేశ్వర్లు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కొణిదెల గ్రామానికి చెందిన కొంగర వెంకటేశ్వర్లు గనేట్లలో రాళ్ల కొట్టుకుంటూ జీవనం కొనసాగించేవాడు. అదే గ్రామానికి చెందిన కొంతమంది ఆ గనేట్లు మావని చదునుచేసి పొలం గా తయారు చేసుకొనడంతో తనకు జీవనాధారం కరువైందని మనస్థాపన చెంది శుక్రవారం సాయంత్రం గనేటి వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకునేందుకు పురుగుల మందును సేవించాడు. పురుగుల మందు తాగానని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రోదించాడు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని చికిత్స నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మానవత్వాన్ని చాటుకున్న డిప్యూటీ తహశీల్దార్ అరుణ


బెడ్ షీట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ అరుణ

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని తుమ్మలూరు గ్రామంలో రోడ్డుపై అనాధకు ఆత్మకూరు రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ కె. అరుణ బెడ్ షీట్లు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి ఆమె ఉద్యోగరీత్యా ప్రతిరోజు నందికొట్కూరు నుండి కార్యాలయానికి వెళ్లే క్రమంలో అనాధలను గమనించి ప్రతి సంవత్సరం వారికి బెడ్ సీట్లు, దుస్తువులు, మహిళలైతే చీరలు, ఆహారం పంపిణీ చేస్తూ ఉంటుంది. ఆమె పాములపాడులో పనిచేసినప్పుడు కూడా అనాధలకు దుస్తుల పంపిణీ చేశారు. అనాధలకు సహాయం చేయడం వల్ల ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు.

ఎర్రగూడూరులో పల్లెనిద్ర

ప్రజాశక్తి - పాములపాడు

రానున్న ఎన్నికల్లో ప్రశాంతంగా ప్రతి పౌరుడు ఓటు హక్కులు వినియోగించుకోవాలని ఆత్మకూర్ రూరల్ సీఐ నాగభూషణ్ కోరారు. శుక్రవారం మండలంలోని ఎర్ర గూడూరు గ్రామంలో సిఐ నాగభూషణ్, పాములపాడు ఎస్సై జి అశోక్‌లు పల్లె నిద్ర నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు సిఐ పలు సూచనలు చేశారు. ఎన్నికల్లో ప్రశాంతంగా పాల్గొనాలని ఎలాంటి అల్లలకు పాల్పడిన కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. చట్టాలపై అవగాహన కల్పించారు సైబర్ క్రైమ్, మహిళల పట్ల జరిగే నేరాలు, డయల్ 100, 112 కాల్స్ గురించి అవగాహన కల్పించారు అదేవిధంగా లిక్కర్ , నాటు సారా విక్రయిస్తే కఠినంగా చర్యలు ఉంటాయని, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.


మాట్లాడుతున్న సీఐ నాగభూషణ్

కులాలకు అతీతంగా సమన్యాయం

- సిద్ధం శివ రామ్ ఆత్మీయ సన్మాన వేడుకలో ఎమ్మెల్యే శిల్పా రవి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుల, మతాలకు అతీతంగా అందరికీ సమన్యాయం చేస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. ఏపీపీఎస్‌సి సభ్యులుగా నియమితులైన సిద్ధం శివరాంకు శుక్రవారం మున్సిపల్ టౌన్ హాల్ నందు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మైనార్టీలకు పెద్ద పీట వేస్తున్నారని ఈ క్రమంలోనే నంద్యాల నియోజకవర్గంలో మున్సిపల్ చైర్మెన్‌గా మాబున్నిసా, ఎమ్మెల్సీగా ఇషాక్ బాషాకు ఇచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. సమిష్టి కృషితోనే అందరికి పద వులు వస్తున్నాయని, నియోజ కవర్గంలో వైసిపీ నాయకులు, కార్యకర్తలు కష్ట పడి పని చేస్తున్నారు కాబట్టే శిల్పా కుటుంబం ఈ స్థాయిలో ఉందన్నారు. మనతో పాటే అందరూ ఎదగాలన్నది శిల్పా మోహన్ రెడ్డి ఆశయం అన్నారన్నారు. కౌన్సిల్‌లో అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందని ఆయన అభిప్రాయ పడ్డారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేయాలని ఏపీ పి ఎస్ సి సభ్యులు సిద్ధం శివ రామ్‌ను కోరారు. అందరి సహకారంతో నంద్యాలను అభివృద్ధి చేశానని శిల్పా రవి స్పష్టం చేశారు. శిల్పా రవి పట్టుదల, సిఎం దగ్గర పట్టు పట్టి చెప్పడంతో సిద్ధం శివరాంకు పదవి వచ్చిందని ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న వాళ్లకు ఆలస్యం అయిన పదవులు రావడం కాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపీ కౌన్సిలర్లు, వైసిపీ నాయకులు జూటూరు సూర్య నారాయణ రెడ్డి, మాజీ కౌన్సిలర్,న్యాయవాది బి. శంకరయ్య కౌన్సిలర్ ఖండే శ్యాం సుందర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే శిల్పా రవిని, ఏపీ పీ ఎస్ సి సభ్యులు సిద్ధం శివ రామ్ ను సన్మానించిన వైసిపీ శ్రేణులు, పలువురు

ఆర్ఎస్ఎస్ గుండాలపై చర్యలు తీసుకోవాలి

- ప్రజా సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి - పాములపాడు

క్రైస్తవులపై దాడులు చేసిన ఆర్ఎస్ఎస్ బిజెపి గుండాలపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని బహుజన్ సమాజ్ పార్టీ నందికొట్కూరు అసెంబ్లీ ఇంచార్జి లింగాల. స్వాములు, మాల మహానాడు జిల్లా నాయకులు అంకన్న, అబ్రహాం, రాజన్నలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల నియోజకవర్గం శంకర్పల్లి మండలం జన్వాడ గ్రామంలో చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులపై ఆర్ఎస్ఎస్, బిజెపి గుండాలు దాదాపుగా 200 మంది రాడ్లు కర్రలతో దూసుకొచ్చి పైశాచికత్వంతో దౌర్జన్యంగా అక్రమంగా ప్రార్థనా మందిరంపై దాడి చేసి క్రైస్తవులపై మారణ హెూమం సృష్టించిన ఆర్ఎస్ఎస్ బిజెపి గుండాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శుక్రవారం పాములపాడు మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ నందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్లో క్రైస్తవ మహిళలపై అర్ధనగ్నంగా మారణోహం సృష్టిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చి రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని చెప్తూ బహిరంగంగా మారణ హెూమం సృష్టిస్తూ మసీదులపై చర్చలపై దాడులు చేయడం సరికాదన్నారు. బిజెపిని బలపరుస్తున్న ఆయా రాష్ట్రాల్లో ఉన్న ప్రాంతీయ పార్టీలను తరిమికొట్టి బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని, లేదంటే భారతదేశాన్ని బిజెపి ప్రభుత్వం సర్వనాశనం చేస్తుందని అన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు


మాట్లాడుతున్న లబ్బి వెంకటస్వామి

ఎమ్మెల్యే టికెట్ అధిష్టానం ఇవ్వలేదు

- ఇంకా ఆలోచన చేసే అవకాశం ఉంది : లబ్బి

ప్రజాశక్తి - కొత్తపల్లి

ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించినా అధిష్టానం ఇవ్వలేదు... కానీ ఇంకా నెలన్నర సమయం ఉంది, ఆ లోపు అధిష్టానం స్థానిక నాయకత్వం గురించి ఆలోచన చేసే అవకాశం ఉందని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం కొత్తపల్లి మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతి దేవీ అమ్మవారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వాసవీ సత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నందికొట్కూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తాను ఎప్పుడు ముందుంటానని సిద్దేశ్వరం వద్ద బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మిస్తే సీమ సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జరిగిన అభివద్ధి తప్ప ఈ పది సంవత్సరాల కాలంలో అభివృద్ధి శూన్యమన్నారు. రానున్న ఎన్నికల్లో నాకు అవకాశం వస్తే ఈ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఆలోచన తనలో ఉందన్నారు. ఫ్యాక్షన్ నుంచి నియోజక వర్గం విముక్తి పొందాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంత వాసిగా, ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవం ఉందని, అందుకే తనకు అవకాశం కల్పిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బన్నూరు సింగిల్ విండో చైర్మన్ రమణ, శివపురం మహబూబ్ బాష, శివపురం మాజీ సర్పంచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి

- నంద్యాల ఎమ్మెల్యే, ఎంపీ

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

వైఎస్ఆర్సిపి ప్రభుత్వం క్రైస్తవుల పక్షాన నిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ మరియు నంద్యాల జిల్లా పాస్టర్ల సహకారంతో సేవకుల సదస్సును పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్ నందు రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి కారురవికుమార్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సదస్సునకు ముఖ్య ప్రసంగికురాలిగా అంతర్జాతీయ సువార్తికులు డా.వైఎస్ విమలారెడ్డి ప్రసంగించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా నంద్యాల శాసన సభ్యులు శిల్పారవిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర దశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాలలో ప్రభుత్వ స్థలాల కొరత ఉందని, క్రైస్తవుల స్మశానవాటికకు స్థల సేకరణ నిమిత్తం అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు అవసరమైన స్థలాన్ని సేకరించిన తర్వాత తాను అలాగే ఎంపీ నిధుల నుండి నిర్మాణం చేపట్టేందుకు కృషిచేస్తానని తెలిపారు. తన తండ్రి శిల్పామోహన్‌రెడ్డి, తాను అధికారంలో ఉన్న కాలంలో నంద్యాల నియోజకవర్గంలోని అనేక చర్చిల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించామని, పేద క్రైస్తవుల పెళ్లిళ్లకు సాయం అందించామని తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రం అమలు చేస్తోందన్నారు. సిఎం జగన్‌ను ప్రతి ఒక్కరు ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యప్రసంగికురాలు, అంతర్జాతీయ సువార్తికురాలు డా. వైఎస్ విమలమ్మ మాట్లాడుతూ దేవుని రాజ్య స్థాపనకు పాటుపడాలని, సమయం, సామర్థ్యం, సంపద వినియోగించుకోవాలన్నారు. క్రీస్తును పోలిన జీవితాన్ని జీవించాలని అందరికి ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పోరేషన్ చైర్మన్ జాన్వెస్లీ, క్రిస్టియన్ మైనార్టీ అడ్వయిజరీ టు సీఎం మద్దు బాలస్వామి, క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జోసఫ్, సలోమి, క్రిస్టియన్ మైనార్టీ జోనల్ ఇంచార్జి విల్సన్ పాల్, ఫాదర్ ప్రసన్న, టైటస్, పాస్టర్ అందనం సుధాకర్, స్టాన్లీ, రెవరెండ్ జోసఫ్, పాస్టర్ విజయభాస్కర్, డా. ఇమ్మానియేలు, డా. మణిరాజాభాస్కర్, డా.ఎంవీసీ మనోజ్ కుమార్, జిల్లా పరిధిలోని పాస్టర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యేరవిచంద్ర కిషోర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ పోచం బ్రహ్మానందరెడ్డి, వైఎస్ విమలమ్మ

ఉత్సవ ఊరేగింపులో ఘర్షణ

- దళితులపై దాడి
- ఇరు వర్గాలపై కేసు నమోదు

ప్రజాశక్తి -ప్యాపిలి

మండలంలోని గార్లదిన్నె గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన సీతారాముల దేవాలయం ఉత్సవ ఊరేగింపులో ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. దళిత వర్గానికి చెందిన చిన్న వీరయ్య,శివనాగ చంద్రు డిపై వైకాపా చెందిన సుబ్బారెడ్డి, ఏకాంతరెడ్డి, రాజశేఖర్ రెడ్డి దాడి చేశారు. బండి చిన్న వీరయ్య ఫిర్యాదు మేరకు సీమ సుధాకర్ రెడ్డి,సీమ రామసుబ్బారెడ్డి,సీమ ఏకాంతరెడ్డి,సీమ శ్రీధర్ రెడ్డి, మెట్టు మల్లారెడ్డి,మెట్టు రాజశేఖర్ రెడ్డి, మెట్టు మనోహర్ రెడ్డిల పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మెట్టు రాజశేఖర్ రెడ్డి పిర్యాదు మేరకు బండి చిన్న వీరయ్య,శివ నాగచంద్రుడు,చిన్న మధు, బండి వేణు,బండి నాగార్జున పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఒపిఎస్‌ను మేనిఫెస్టోలో చేర్చాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె

ఓపిఎస్‌ను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని యుటిఎఫ్ జిల్లా సహ అధ్యక్షులు సత్య ప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బిజెపి బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ బి.వి. సుబ్బారెడ్డి కి యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఎన్ ప్రతాప్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు . ఈ సందర్భంగా నంద్యాల జిల్లా యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కే సత్య ప్రకాష్ మాట్లాడుతూ సిపిఎస్ 2004 సెప్టెంబర్ ఒకటే వ తేదీన అమలులోకి వచ్చిందన్నారు. సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల కాంట్రిబ్యూషన్ కార్పొరేట్ వర్గాలకే మేలు చేస్తుందని, ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టం కలగజేస్తుందని తెలిపారు. ఓట్ ఫర్ ఓ పి ఎస్ లో భాగంగా ఏ రాజకీయ పార్టీ అయితే సిపిఎస్ రద్దు చేస్తామని వారి ఎన్నికల మ్యానిఫెస్టోలో చేరుస్తారో వారికే మా ఓటు వేస్తామని తెలిపారు. అందుకు బివి సుబ్బారెడ్డి స్పందిస్తూ మా రాష్ట్ర అధిష్టానం దష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యవర్గ సభ్యులు కే ఎం నాగరాజు, జిల్లా ఆడిట్ కన్వీనర్ యు. దస్తగిరి,డి సురేష్, వై సుంకన్న, పి రంగన్న, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శివ కష్ణ యాదవ్, మండల అధ్యక్షులు ఎస్ యాదగిరి, సంజామల మండల అధ్యక్షులు చిన్నయ్య యాదవ్, కొలిమిగుండ్ల మండల అధ్యక్షులు రామసుబ్బయ్య, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు శివరామిరెడ్డి, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు బాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **డోన్ :** పాత పెన్షన్ అమలు గురించి ఎన్నికల మేనిఫెస్టో లో చేర్చాలని యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి,జిల్లా కార్యదర్శి బివై సుబ్బారాయుడు,జిల్లా కార్యదర్శి లక్ష్మి దేవి కోరారు. 3 లక్షల మంది ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చి పదవీ విరమణ చేసిన తర్వాత వారికి భరోసా కల్పించే పాతపెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని కోరారు.యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగుల పెన్షన్ విధానం గురించి ఆయా రాజకీయ పార్టీల వైఖరి తెలియచేసి వారి ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చడమే గాక ఇచ్చిన మాట ప్రకారం పాత పెన్షన్ విధానం మాత్రమే పునరుద్ధరించాలని కోరుతూ డోన్ వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అలాగే బిజెపి నాయకుల కు ఆపార్టీ కార్యాలయం లో వినతిపత్రం సమర్పించారు. యుటిఎఫ్ నాయకులు సీనియర్ నాయకులు,ప్రసాద్, శ్రీనివాసులు,సుమన్, సంజీవరాయుడు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.






గురురాజా విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నంద్యాల

రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీల నందు తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లుగా డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం జరిగిన అభినందన సమావేశంలో అయన మాట్లాడుతూ నంద్యాల పట్టణం నందు నిర్వహించిన జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీలు నందు వి . శ్రావణి ద్వితీయ బహుమతి,డి .ధరణిధర్ రెడ్డి తృతీయ బహు మతి, డి. సుబ్బారాయుడు, ఏ . మధుమోహన్, కే .గౌతం నాయక్ స్పెషల్ జ్యూరీ బహుమతులను సాధించి, రోడ్ ట్రాన్స్పోర్ట్ అధికారులచే జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసి విద్యార్థుల విజయాలను ప్రశంసించినట్లుగా తెలిపారు. జిల్లాలో అత్యధిక బహుమతి సాధించిన ఏకైక పాఠశాల గురు రాజ పాఠశాల అని తెలియ జేయుటకు సంతోషిస్తున్నామన్నారు. విద్యార్థుల విజయానికి చక్కని శిక్షణ అందించిన డ్రాయింగ్ మాస్టర్ ను ప్రత్యేకంగా అభినందించారు.

పోస్టల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఇచ్చిన పిలుపుమేరకు అపరిష్కృతంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం పోస్టల్ ఉద్యోగులు శుక్రవారం విధులు ముగిసిన అనంతరం స్థానిక పోస్ట్ ఆఫీస్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్పిఎస్ రద్దుచేసి ఓపిఎస్ తిరిగి అమలు చేయాలన్నారు. 8వ వేతన సవరణ కమిషన్ను నియమిం చడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలనీ, నిలిపివేసిన 18 నెలల కరువు భత్యం బకాయిలను విడుదల చేయాలన్నారు. ఎన్ఎఫ్ పిఈ/ఏఐపిఈయు గ్రేడ్ సి సంఘాల గుర్తింపును తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐపియుసి నంద్యాల డివిజన్ కార్యదర్శి మనోజ్ కుమార్, జాకీర్ హుస్సేన్, పోస్ట్ మాన్ అసిస్టెంట్ సెక్రటరీ అమీరుల్లా బేగ్, బాలరాజు, ఉస్మాన్ భాష, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



కార్మిక,కర్షక ఆగ్రహం

5వ పేజీ తరువాయి

వి.సుబ్బరాయుడు, సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్ యన్నా, సిఐటియు మండల కార్యదర్శి రహమతుల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ ఆధ్వర్యంలో మద్దిలేటి స్వామి ముఖ ద్వారం దగ్గర రాస్తారోకో నిర్వహించారు. **శ్రీశైలం ప్రాజెక్ట్ :** సున్నిపెంటలో ఏఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు నాయకులు ఓబులయ్య, పులి రాజు, అన్వర్ భాష, సిపిఎం నాయకులు చిన్న మారెన్న, సిఐటియు నాయకులు నాగరాజు, ఆశీర్వాదం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. **కొత్తపల్లిలో** రాస్తారోకో చేపట్టారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.స్వాములు, ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు జి.దాసు అన్నారు. **పాములపాడులో** రాస్తారోకో నిర్వహించారు. కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలయ్య, ఎస్ ఆర్ రమణలు మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం అమలు చేయకుండా దేశ ప్రజలను మోసం చేస్తోందన్నారు. **పాణ్యంలో** నంద్యాల, కర్నూలు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి కె భాస్కర్, సమాజ్‌వాద్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివకృష్ణ యాదవ్ మాట్లాడుతూ డ్రైవర్లను జైలు పాలు చేసే సెక్షన్‌ను రద్దు చేయాలి, అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. **గడివేములలో** తహశీల్దార్ కార్యాలయం నుండి కొత్త బస్టాండ్ వరకుర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు వసంతమ్మయ్య, రాములమ్మ, కొండమ్మ, ఆటో యూనియన్ నాయకులు సోమన్న, రైతు సంఘం నాయకులు గిద్దన్న, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు చెన్నమ్మ, ఆశాబీ పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ : చాగలమర్రిలో** అంగన్వాడీ యూనియన్, సిఐటియు నాయకులు పద్మావతి, నాగమణి, సంజమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీలు పురవీధుల గుండా నిరసన ర్యాలీ నిర్వహించారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని అన్ని రకాల ఆహార వస్తువులపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. **ఆళ్లగడ్డలో** సిఐటియు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం నుండి బస్టాండ్, నాలుగు రోడ్ల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. దుకాణాలు, బ్యాంకులు మూసి వేయించి గ్రామీణ బంధు నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వి.బాల వెంకట్, సిఐటియు పట్టణ కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని అన్ని రకాల ఆహార వస్తువులపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలన్నారు. **వెలుగోడులో** బస్టాండ్ దగ్గర నుంచి ర్యాలీగా బయలుదేరి పొట్టి శ్రీరాములు సెంటర్ దగ్గర రాస్తారోకో నిర్వహించి నిరసన చేపట్టారు. సిఐటియు మండల అధ్యక్షులు నాగమోహన్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు యాదాటి నాగేంద్రుడు, సిఐటియు మండల నాయకులు , జిల్లా అవాజ్ నాయకులు మహమ్మద్ రఫీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, ఆటో యూనియన్ కార్మికులు మరియు సిఐటియు నాయకులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూరు మండల కేంద్రంలో** సిపిఎం ఆధ్వర్యంలో రైతు,కార్మిక సంఘాల అనుబంధ సంఘాలతో గ్రామీణ బంద్ నిర్వహించారు. రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామచంద్రుడు, డేవిడ్, రత్నమయ్య, రాజు మాట్లాడుతూ కేంద్రం రైతులపై నిరంకుశ ధోరణి వినడి రైతులతో చర్చలు జరిపి గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. సుబ్బరాయుడు, స్రవంతి, ఏసన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని పెట్రోల్ బంకు కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి జెవి సుబ్బయ్య మాట్లాడారు. ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు దస్తగిరి , తిరుమల్, నగేష్, శీను, మధు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.


గడివేములలో..


శ్రీశైలం ప్రాజెక్ట్ : నిరసన చేస్తున్న నాయకులు


నందికొట్కూరులో.. నిరసన చేస్తున్న నాయకులు


బేతంచెర్లలో..


పాములపాడులో..


డోన్‌లో శివరాం ఆధ్వర్యంలో ప్రదర్శన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు. నంద్యాల

E.P. No. 26/2023 IN O.S. No. 469/2021

ఎలిశెట్టి నాగరాజు .... డి.హెచ్.ఆర్

వర్సెస్

షేక్ మాలిక్ భాష died by L.Rs
1. షేక్ కరీముల్లా
2. షేక్ అబ్దుల్ హమీద్
4. షేక్ మహబూబ్ బాషా
5. షేక్ అబ్దుల్ గని

పై అందరి అడ్రస్. డోర్.నెం. 28/1046-C1, సాయిబాబా నగర్ , నంద్యాల టౌన్ మరియు నంద్యాల జిల్లా ......జే.డి.ఆర్స్

జె.డి.ఆర్స్ 1,2,4,5 కు order 21 rule 66 C.P.C నోటీస్

పై E.P లో D.Hr, J.Drs అయిన మీ పైన అమలు అర్జీ మొత్తం రాబట్టుకొనుటకు J.Drs తాలూకు ఆస్తి నంద్యాల సాయి బాబా నగర్ H. No.28/1046-C1, ఇల్లు వేలం కోరి E.P దాఖలు చేసి ఉండి, పై అమలు అర్జీ నందు కోర్టు వారు ఎన్నిసార్లు అమలు అర్జి నోటీసులు పంపినను మీరు తీసుకోనందున జే.డి.ఆర్స్ 1,2,4,5 అయినా మీ హాజరు కొరకై 25-3-2024వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. పై అమలు అర్జీ సంబంధించి, మీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్నా యెడల 25- 3 -2024 వ తేదీ ఉదయం 10:30 గంటలకు స్వయముగా గాని, వకీల్ ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల పై కోర్టు వారు మీకు వ్యతిరేకంగా తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ: 25-3-2024

Y.V. రమణారెడ్డి
డి.హెచ్.ఆర్ పరం అడ్వకేట్
నంద్యాల జిల్లా. PH.9440361130